# కామ్రేడ్ అంగడి చెన్నయ్య 18వ వర్ధంతి సభ

**గుంటూరు, 8-12-19 :**

పీడిత ప్రజల పోరాటయోధుడు, అమరుడు కామ్రేడ్ అంగడి చెన్నయ్య 18వ వర్ధంతి సభ గుంటూరులో డిసెంబరు 1వ తేదీ ఉదయం 11 గంటలకు కామ్రేడ్ చెన్నయ్యగారి స్తూపం వద్ద జరిగింది.రైతుకూలీ సంఘం రాష్ట్ర కోశాధికారి కామ్రేడ్ లలిత ఆహ్వానించగా పార్టీ నాయకులూ, వివిధ సంస్థల ప్రతినిధులు, కామ్రేడ్ చెన్నయ్య గారి కుటుంబ సభ్యులు, తదితరులు తొలుత చెన్నయుగారి స్తూపం వద్ద పూలు వుంచి నివాళులు అర్పించారు.కామ్రేడ్ నీలాద్రి రాంబాబు వక్తలను వేదికపైకి ఆహ్వానించగా, కామ్రేడ్ ఉల్లిగడ్డల నాగేశ్వరరావు ఈ సభకు అధ్యక్షత వహించారు.



కా॥అంగడి చెన్నయ్య సంస్మరణసభలో ప్రసంగిస్తున్న కా॥గుర్రం విజయకుమార్

సి.పి.ఐ (ఎం-ఎల్) కేంద్ర నాయకులు కామ్రేడ్ గుర్రం విజయకుమార్ తొలుత మాట్లాడుతూ కామ్రేడ్ చెన్నయ్యగారి కృషిని, అమరత్వాన్ని వివరించారు. దేశ ఆర్థిక రాజకీయ పరిస్థితులను వివరిస్తూ కేంద్రంలో మోడీ ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలను వివరించారు. రైతుకూలీ సంఘం (ఆం.ప్ర) రాష్ట్ర అధ్యక్షులు కామ్రేడ్ ఎస్.ఝాన్సీ మాట్లాడుతూ కామ్రేడ్ చెన్నయ్యగారు జిల్లాలో వర్గ, ప్రజా ఉద్యమానికి పునాదులు వేయడానికి పడిన శ్రమను గుర్తు చేసుకొన్నారు. అమరులు చెన్నయ్య, విశ్వమోహనరెడ్డి, మరియమ్మ, అప్పారావు, పున్నయ్య, శంకర్ తదితరుల అమరత్వం వృధా కానివ్వరాదని, ఉద్యమ, నిర్మాణాలలో వారి నిబద్ధతను కొనసాగించాలని వివరించారు. ప్రియాంకారెడ్డిపై జరిగిన అత్యాచార ఘటనను వివరిస్తూ ఒక నీచ సంస్కృతిని పెంచిపోషిస్తున్న పాలకవర్గాలకి వ్యతిరేకంగా పోరాడాలని చెప్పారు. తదనంతరం భీమ్రేడ్ కంచర్ల శేషు మాట్లాడుతూ మనువాదం, మద్యపానం మహిళలను, సమాజాన్ని ఎంత అణచివేతకూ, వేదనకు గురిచేస్తున్నదో సోదాహరణంగా వివరించారు. ఏఐఎఫ్టియు(న్యూ) రాష్ట్ర నాయకులు డి.వి.ఎన్.స్వామి మాట్లాడుతూ అనేక ప్రాంతాలలో కామ్రేడ్ చెన్నయ్యగారి అధ్వర్యంలో జరిగిన పోరాటాలను, భూస్వాముల సాంఘిక దౌర్జన్యాలను తిప్పికొట్టి నిలచిన సందర్భాలను గుర్తు చేసారు. వక్తలు కార్మికులపై కేంద్ర ప్రభుత్వ దాడిని, కార్మిక చట్టాల సవరణ పేర పనిగంటల పెంపును వివరిస్తూ జనవరి 8న జరగాల్సిన సార్వత్రిక సమ్మె గురించీ, గ్రామీణ భారత్‌బంద్ పిలుపుల గురించి వివరించారు. ప్రజలు సంఘటిత పోరాటాలకు సిద్ధం కావాలని, కార్యకర్తలు అందుకు చిత్తశుద్ధితో నిస్వార్ధంగా కృషిచేసి ప్రజలను కదలించాలనీ అదే అమరులకు ఇచ్చే నివాళని చెప్పారు. జిల్లాలోని వివిధ ప్రాంతాలనుంచి వచ్చిన వందలాదిమంది ప్రజలతో కామ్రేడ్ చెన్నయ్య గారి సంస్మరణ సభ విజయవంతం అయింది. ఈ సభలో ఇంకా ఏఐఎఫ్టియు(న్యూ) రాష్ట్రకార్యదర్శి కా॥జె.కిషోర్‌బాబు, రైతుకూలీసంఘం(ఆం.ప్ర) జిల్లా నాయకులు కామ్రేడ్స్ శోభారాణి, దానబోయిన భాస్కరరావు తదితరులు మాట్లాడారు.

సభకు ముందుగా జిల్లా నలుమూలలనుండి వచ్చిన కార్యకర్తలతో గుంటూరు రైల్వేస్టేషను నుండి చుట్టగుంటసెంటర్ వరకు పెద్దఎత్తున నినాదాలు చేస్తూ ప్రదర్శన నిర్వహించారు.

ooo